ప్రజాశక్తి

గురువారం 9 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





కోచింగ్‌ల్లోనూ ఛీటింగ్‌లే!



చిలక్కొట్టుడు 'చిరు'పై ఫిర్యాదులెన్నో

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విద్యావేత్త, ఎకానమీలో ఉత్తమ ఫ్యాకల్టీ అంటూ ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో తెగ ప్రచారం చేపడుతున్న ఓ ప్రబుద్ధుడి అక్రమాలు తవ్వుతున్న కొద్దీ బయటపడుతున్నాయి. ఎన్నికలొస్తే మాయమాటలు చెప్పే ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, బిజెపి పార్టీల్లో ఈ తరహా వ్యక్తులకు కొదవేమీ లేదు. మేధావులు, సామాజిక కార్యకర్తలను పంపించాల్సిన పెద్దల సభ వంటి మండలికి కూడా వీరు 'తగుదునమ్మా' అంటున్నారు. తాజాగా పట్టభద్రుల ఎన్నికల్లోనూ ఇలాంటివారే బరిలో నిల్చొని ఓటర్లను ప్రలోభాలకు గురిచెయ్యాలనుకోవడం ఉత్తరాంధ్ర పట్టభద్రులకు నిజంగా ఒక పరీక్షగానే చెప్పొచ్చు. ప్రభుత్వాలను ఉపయోగించుకుని అక్రమ ఆస్తులను కూడబెట్టుకోవడం ఒక్కటే కాదు. విద్యావేత్తగా ఉంటూ కోచింగ్ సెంటర్లలో గతంలో పాల్పడిన అక్రమాలు 'చిరు' జ్ఞాపకాలుగా నిరుద్యోగులు పలువురి చర్చల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో చిలక్కొట్టుడు 'చిరు' బరిలో ఉన్నాడంటూ వీరు చెప్పుకోవడానికి వెనక పలు ఉదంతాలు వీరి చర్చలకు అజెండాగా మారాయి..

ఎలాగైనా గెలవాలన్న ఎత్తులు..

ఇటీవల రూ.26లక్షల నగదుతో పట్టుబడ్డ పట్టభద్రుని చరిత్ర ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఓటర్లందరికీ తెరచిన పుస్తకమే. పైపెచ్చు వారి వారి సోషల్‌మీడియాలో తామేం చేయబోతున్నారో ఎజెండా లేకుండా పిడిఎఫ్ అభ్యర్థులపై అవాకులు చెవాకులు వల్లెవేసేదిశగా సదరు చిలక్కొట్టుడు చిరు గ్రూపును నిర్వహిస్తున్నారు. తాను పేద వాడినని, విద్యావేత్తనంటూ తెలుగుదేశం పార్టీలో పెద్దలను పలువురిని కలుస్తూ ఆర్థికంగా వారినుంచే రూ.లక్షలు ఫండ్ రూపంలో స్వీకరిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు. తాజాగా ఆయనపై పలు విమర్శలు రావడంతో టిడిపి శ్రేణులు సైతం అవాక్కవుతున్నాయి. 2016 నుంచి ఇప్పటివరకూ విశాఖలోని కోచింగ్ సెంటర్లలో ఏ పేద, సామాన్య దళిత, గిరిజన, బిసి విద్యార్థులను కదిపినా సదరు వ్యక్తి బాగోతం, నిరుద్యోగులను మోసగించిన వైనంపై పుంఖానుపుంఖాలుగా చెబుతుండడం తాజా పరిణామం. ఈయనపై హైదరాబాద్ ఆర్‌సిరెడ్డి కోచింగ్ సెంటర్, 2009–2015 వరకూ పలు సెంటర్లలోనూ 'ఎకానమీ' సబ్జెక్టు కోచింగ్ ఇస్తూ... పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఫిర్యాదులూ ఉన్నాయి. చిక్కడపల్లిలో 2015లో ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదూ లేకపోలేదు. అశోక్‌నగర్ ఆర్‌సి.రెడ్డి కోచింగ్ సెంటర్లో 2014లో కోచింగ్‌లో చేరిన ఓ మహిళకు మాయమాటలు చెప్పి పెళ్లివరకూ తీసుకొచ్చి తర్వాత ససేమిరా అనడంతో చిక్కడపల్లి స్టేషన్‌లో కేసు నమోదు వరకూ వెళ్లి రాజీచేసుకున్నాక చిలక్కొట్టుడు చిరు తన మకాంను విశాఖకు మార్చుకున్నాడు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల తీర్పు సహజంగా విలక్షణమైన రీతిలో ఉంటుందన్నది సదరు వ్యక్తులు తెలుసుకునేలా 2023 ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఉండనున్నాయి.

కొసమెరుపు

సదరు చిలక్కొట్టుడి 'చిరు' సతీమణి విశాఖలోని కృష్ణా కాలేజీలో లెక్చరర్‌గా ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. ఎన్నికలు రావడంతో సెలవు పెట్టేసి... తన పతి గెలుపునకు విస్తృతంగా ప్రచారంలో ఉన్నారు.



'ప్రజాశక్తి' రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ప్రజాశక్తి సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విజయనగరం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ మిగతా 2లో..



ఘనంగా మహిళా దినోత్సవం

వార్తలు లోపలి పేజీల్లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి పనిచేస్తా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధితో పాటు సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారం, ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జిఒ నెంబరు 3 పునరుద్ధరణ వంటి పలు అంశాలపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ చెప్పారు. స్థానిక దొడ్డి రామినాయుడు కార్మిక, కర్షక భవనంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం హామీ ప్రకారం వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఉత్తరాంధ్ర జిల్లాలకు రాబెట్టేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాలు బలపర్చిన అభ్యర్థిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. రూ.3.50 లక్షల కోట్ల విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు విక్రయించే ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి కృషి చేస్తానని మిగతా 2లో..

స్మార్ట్ మీటర్ల టెండర్లు నిలిపివేయాలి : ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : స్మార్ట్ మీటర్ల కోసం టెండర్లు పిలిచే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను అమర్చాలని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని, స్మార్ట్ మీటర్ల అధిక ధరను పరిగణనలోకి తీసుకుంటే, అటువంటి మీటరింగ్ యొక్క నికర ప్రయోజనం ప్రతికూలంగా ఉంటుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లను సరఫరా చేసే ప్రైవేట్ కంపెనీలు మాత్రమే నికర లాభం పొందుతాయని నిపుణుల అధ్యయనాలు ధ్రువీకరిస్తున్నారని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఖర్చులు , ప్రయోజనాలను అంచనా వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించిందని ఆ కమిటీ నుంచి ప్రభుత్వానికి నివేదిక ఏమైనా వచ్చిందా? కనుగొన్న విషయాలు ఏమిటి? నివేదికను ప్రభుత్వం ఎందుకు ప్రజల ముందుంచలేదు? అని ప్రశ్నించారు. కేంద్రీకృత సోలార్ ప్లాంట్‌ల నుంచి వ్యక్తిగత సోలార్ ఇరిగేషన్ పంపుసెట్‌లు, సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్‌లపైకి ప్రభుత్వం దృష్టి మార్చాలని కోరారు. ఇవి రివర్స్ మీటరింగ్ అందించినట్లయితే, శక్తి ప్రసార నష్టాలను ఆదా చేస్తూ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. గ్రిడ్‌కు మిగులు శక్తి అమ్మకం నుంచి వినియోగదారులకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి పనిచేస్తా...

చెప్పారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడతానన్నారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల కోసం పనిచేసే వేదిక పిడిఎఫ్ అని తెలిపారు. పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న తనను గెలిపిస్తే ఆయా తరగతుల సమస్యలపై పనిచేస్తానన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కూడా శాసనమండలిలో ప్రస్తావించి వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. ఉత్తరాంధ్రలో మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు ప్రభుత్వంపై ఒత్తిడితెస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి, ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ నాయకులు మళ్ల చంద్రశేఖరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, గొరైలు, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు బి.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' రక్తదాన శిబిరం

డాక్టర్ పి.ఎ.రమణి హాజరై మాట్లాడారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం ఎవరు, ఎప్పుడు చేయవచ్చు, సేకరించిన రక్తాన్ని ఏ విధంగా విభజిస్తారు, ఉపయోగిస్తారు అన్న విషయాలను వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న కృషిని వివరించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ప్రజాశక్తి ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ శివనాగేంద్రరెడ్డి, ప్రజారోగ్య వేదిక నాయకులు టి.కామేశ్వరరావు, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, బ్యూరో చీఫ్ మధుసూధనరావు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు

స్టీల్ ప్లాంట్ రక్షణకు వెనుకాడం

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రయివేటీకరిస్తే సహించేది లేదని, దీనిని రక్షించుకోవడం కోసం ఎన్ని పోరాటాల కైనా వెనకాడేది లేదని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నర్సింగరావు స్పష్టంచేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జేఏసీ చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 704వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ ఐఎన్‌టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌తో సహా అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉన్నందునే విశాఖ నగరం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. వీటి ద్వారా లక్షలాదిమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటామని తెలిపారు. హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తాతబాబు పాల్గొన్నారు.

పలు రైళ్ల మళ్లింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సికింద్రాబాద్ డివిజన్‌లోని గంగినేని, ఎర్రుపాలెం స్టేషన్ల పరిధిలో నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్ల దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. 18519 విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9, 11, 13, 15, 16 తేదీలలో విశాఖపట్నం నుంచి బయలుదేరి గుంటూరు, పగిడిపల్లి స్కిప్పింగ్ మీదుగా కాజీపేట జంక్షన్‌కు మళ్లిస్తున్నారు. గుంటూరులో అదనపు స్టాపేజ్ ఉంటుంది. 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 15 తేదీల్లో విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వరంగల్, కాజీపేట మీదుగా మళ్లిస్తారు. విజయవాడ, గుంటూరులో అదనపు స్టాపేజ్ ఉంటుంది. 18112 యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 12న పగిడిపల్లి, గుంటూరు స్కిప్పింగ్ స్టాపేజ్ మీదుగా కాజీపేట, వరంగల్ వైపు మళ్లిస్తారు. గుంటూరులో అదనపు స్టాపేజ్ ఉంటుంది. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి అభ్యర్థించారు.

మహిళా సాధికారతను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : లింగ సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహించడం తమ దృఢ నిబద్ధతకు నిదర్శనమని విశాఖపట్నం హెచ్‌సిజి కేన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిత్య కౌరా పేర్కొన్నారు. కలర్స్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ పేరుతో హెచ్‌సిజి సిఎంఆర్ మాల్, మరొక ఆసుపత్రిలోను బుధవారం వినోద కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనటం వారి పట్టుదలను రుజువు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా స్టిలెట్టోస్‌లో వాక్, రన్ కార్యక్రమాలను నిర్వహించారు. పురుషుల కోసం ప్రత్యేకమైన ర్యాంప్‌తో పాటు అది ఎలా ఉంటుందో ప్రదర్శించారు. మహిళలు బూట్లు ధరించి తరచూ ఎదుర్కొనే సవాళ్లను ఈ వాక్‌లో హైలెట్ చేశారు. మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు కర్నూలు నుంచి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నాయని సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు బ్యాలెట్ పేపర్లు పంపించామని పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు.



కలెక్టరేట్‌లో బ్యాలెట్ పేపర్లను దించుతున్న సిబ్బంది

ఎపిఎంఎస్ఎండిసి ఛైర్మన్‌గా ఆడారి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎపి మైక్రో, స్మాల్ అండ్ మీడియం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజెస్ (ఎపిఎంఎస్ఎండిసి) ఛైర్మన్‌గా ఆడారి ఆనంద్‌కుమార్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ డెయిరీ ఛైర్మన్‌గా, విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ఆనంద్‌కుమార్‌కు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. తనపై ఉన్న విశ్వాసంతో పదవి అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ ముఖ్య నాయకులు వై.సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

మెట్రో టీవీ వీడియో జర్నలిస్ట్ మృతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మెట్రో టీవీలో వీడియో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న బోనుల చిన్న (36) మంగళవారం రాత్రి హఠాన్మరణం చెందారు. మంగళవారం రోజంతా వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఆయన సాయంత్రం భోజనం తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఊర్వశి జంక్షన్ సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, 6 ఏళ్ళ బాబు ఉన్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2023 సందర్భంగా విశాఖపట్నం ప్రభుత్వ రీజినల్ నేత్ర ఆసుపత్రి ఆధ్వర్యాన నగర మహిళా పోలీసులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది మహిళా పోలీసులు పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రి సేవలకు డిసిపి-1 సుమిత్ గరుడ్ సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



బిఎన్‌ఆర్‌భవన్‌లో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత కనకదుర్గ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పలు కార్యాలయాలు, సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల్లోని మహిళా ఉద్యోగులు, ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. సమాజంలోనూ, కుటుంబంలోనూ మహిళల పాత్రను, వారి ఔన్నత్యాన్ని పలువురు కొనియాడారు.

(ప్రజాశక్తి యంత్రాంగం)

కంచరపాలెం : స్థానిక బిఎన్‌ఆర్ భవనంలో ఐద్వా, బిఎన్‌ఆర్ ఫౌండేషన్, ద్వారకానగర్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా యుటిఎఫ్ నేత బి కనకదుర్గ మాట్లాడుతూ సామాజిక చైతన్యంతోనే మహిళలపై వివక్ష, వేధింపులు, అత్యాచారాలు వంటి రుగ్మతలను రూపుమాపవచ్చన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ, బాధిత మహిళలకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందన్నారు. ఐద్వా నేత బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం అలవరచుకుని మహిళలు ఐక్యంగా ఉండాలన్నారు. బిఎన్‌ఆర్ ఫౌండేషన్ సభ్యుడు అప్పలరాజు మాట్లాడుతూ, మహిళలకు స్వయంఉపాధి శిక్షణ ద్వారా వారికి ఫౌండేషన్ చేదోడుగా ఉంటోందన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌కు కనకదుర్గ రూ.25వేలు, మురళీనగర్ ఐద్వా నేత రూ.10వేలు వితరణ అందించారు. బిఎన్‌ఆర్ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన ఇద్దరు పేద మహిళలకు లయన్స్‌క్లబ్ ఉచిత కుట్టుమిషన్లు అందజేసింది. కార్యక్రమంలో ఐద్వా నేతలు రాణి (ఏలూరు), అనురాధ, పుష్ప, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, స్వతంత్రకుమార్, బిఎన్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, రామారావు, బుజ్జి పాల్గొన్నారు. ఆటలపోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

సీతమ్మధార : రామాటాకీస్ దరి ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో డిసిపి సుమిత్ సునీల్ గరుడ పాల్గొన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్న మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకునే స్థితిలో లేరన్నారు. సుమారు వందమందికి కంటిపరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, పోలీసుల ఉన్నతాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ

అంబేద్కర్ భవన్‌లో మహిళా విభాగం, దళిత హక్కుల పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెవి. ప్రభాకర రావు పాల్గొని,'మూవింగ్ మైండ్స్ ఇండియా సంస్థ' సమకూర్చిన చీరలను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ త్రివేణి, అంబేద్కర్ భవన్ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, మహిళా అధ్యక్షురాలు రాజా సరస్వతి, న్యాయవాది రత్నకుమారి పాల్గొన్నారు.

భీమునిపట్నం : మహిళా సాధికారతకు టిడిపి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించినఅంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబుతో కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. తెలుగు మహిళ లకు సన్మానం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కార్పొరేటర్ పి.మంగమ్మ, మహిళా నేత కె.లీలావతి, బి రమాదేవి పాల్గొన్నారు


భీమిలిలో తెలుగు మహిళలను సత్కరిస్తున్న టిడిపి నేతలు

జివిఎంసి ఒకటో జోనల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు జెడ్‌సి బొడ్డేపల్లి రాము సత్కరించారు. యుసిడి, ఎపిడి ఎల్ రాము, డాక్టర్ అఖిల పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి సిఐటియు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐద్వా నేతలు బి. రమణి, రజని, లక్ష్మి పాల్గొన్నారు

97వ వార్డు గిరి ప్రసాద్‌నగర్‌లో మహిళా సమైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల మాట్లాడుతూ మహిళా చట్టాల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. జిల్లా అధ్యక్షురాలు బేగం, నాయకులు లక్ష్మీ, వనజ పాల్గొన్నారు

తగరపువలస : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, సమాన హక్కులు కల్పించాలని సిఐటి యు, ఐద్వా నేతలు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె నాగరాణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సిఐటియు, ఐద్వా నేతలు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు, శ్రీనివాసవర్మ, ఎస్‌గున్న, భాగం లక్ష్మి పాల్గొన్నారు

వైసిపి కార్యాలయంలో : భీమిలి వైసిపి కార్యాలయంలో మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని పలువురు మహిళలను సన్మానించారు .జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, వైసిపి రెండో వార్డు ఇంఛార్జి ఎన్ సరళారాణి, నేత కరుణాకరరెడ్డి పాల్గొన్నారు

గీతంలో..

మధురవాడ : గీతం వర్సిటీ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.. ప్రముఖ గైనకాలజిస్ట్, హెర్ క్లీనిక్ డాక్టర్ ఎమ్ఎన్‌వి.పల్లవి మాట్లాడుతూ గృహిణిగా, పారిశ్రామికవేత్తగా, శాస్త్రవేత్తగా, అధ్యాపకురాలుగా ఇలా అన్ని రంగాల్లో మహిళలు బహుముఖ ప్రజ్ఞను కనబరిచి, నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. కుటుంబపోషణలో మహిళల పాత్ర అనిర్వచనీయమన్నారు. జిమ్‌సర్ ప్రొవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, యువ వైజాగ్ ఫౌండర్ డి.శిల్పాంజలి, గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ మాధురి ఖాశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్పనా చావ్లా అవార్డును సిఎస్‌ఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ శిరీష, కాదాంబిని బోస్ అవార్డును స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ వి. అనితారావు, కమలా సోహిని అవార్డును గీతం దంత వైద్యకళాశాల పైడరాజు, డొక్కా సీతమ్మ అవార్డును జిమసర్ కళాశా ప్రిన్సిపాల్ జ్యోతి పద్మజకు అవార్డులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాజువాక : శ్రీనగర్ రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌వికె. పరుశురాం ఆధ్వర్యంలో మహిళా టీచర్లను సత్కరించారు.

జీవీఎంసీ 85 వార్డు అగనంపూడి పునరావాస కాలనీ సెక్టార్ 3 దిబ్బపాలెం స్టార్ డం ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సంపంగి రంగారావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకల్లో పెందుర్తి ప్రభుత్వాసుపత్రి డాక్టర్ వి.ప్రమీల జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు.

గాజువాక : మహిళల హక్కులపై పోరాడాలని ఏప్రిస్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పిమనోహర్ అన్నారు. గాజువాక తోకడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తౌటయ్య, ఉపాధ్యక్షులు తవుడన్న, ట్రెజరర్ ఎంవి రమణ, మహిళా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మణి, స్వప్న, ఐద్వా స్టీల్ డివిజన్ అధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు. ముందుగా ఐద్వా జెండాను ఆవిష్కరించారు.

అరిలోవ :చినగదిలి ప్రభుత్వ బాలికల హోంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఐసిడిఎస్, సిఆర్‌పిఎఫ్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీల సారథ్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు కమిషన్ సభ్యులు గొండు సీతారాం, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్ రాధ, సభ్యులు విజయలక్ష్మి, రజని, లక్ష్మి, హోం నిర్వాహకురాలు సునీత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, పిఒఎన్ఐసి మమత కేక్ కట్ చేశారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.సిఆర్‌పిఎఫ్ ప్రతినిధులు శకుంతల, ఎల్లయ్య, డాక్టర్ లవకుశ, ప్రవీణ, డాక్టర్ జగ్గారావు, అనిజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాధవధార: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ డివిజనల్ హెడ్ ఆఫీస్‌లో మహిళా దినోత్సవం సందర్భంగామెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మహిళలకు కేన్సర్‌పై అవగాహన, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ డిఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని మహిళా కార్మికులకు శుభాకాంక్షలు అందజేశారు. జోనల్ ప్రెసిడెంట్ ఆర్‌విఎస్ఎస్ రావు, డివిజనల్ కోఆర్డినేటర్ పివిజె.రాజు, డిప్యూటీ డివిజనల్ కోఆర్డినేటర్ పిఆర్ఎం.రావు పాల్గొన్నారు.

మనువాదానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి

కలెక్టరేట్ : స్త్రీ పురుష సమానత్వం కోసం, పితృ సామ్యాన్ని కాపాడుతున్న మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎల్‌ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విగ్రహం వద్ద సభ జరిగింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, న్యాయవాది కెఎస్.చలం, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రోహిణి, ఎస్.వెంకటలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు కె.బాలనాగమ్మ, కె.నిర్మల, సాయి, వై.నూకరాజు, ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



నగరంలో పిఒడబ్ల్యు ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జైలు రోడ్డులోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఎఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా మహిళా కన్వీనర్ సిహెచ్ భాగ్యశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వై.విజయ్‌కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సిఎన్.క్షేత్రపాల్ మాట్లాడుతూ, ఆధునిక మహిళ ప్రపంచ చరిత్ర గమనాన్ని సమూలంగా మార్చుతుందన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, హాస్టల్ వార్డెన్ ఎస్.అన్నపూర్ణ, కె.అనిత, జి.ప్రీతి పాల్గొన్నారు.

ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన

కలెక్టరేట్ : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన 35వ వార్డు కార్పొరేటర్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం, మహిళా సాధికారత కోసం ధాన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు.జివిఎంసి ఎపిడి పుణ్యవతి, సిఒ ఇంద్రావతి, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ చైత, ఎపి మాస్ కో-ఆర్డినేటర్ సత్యవతి, ధాన్ ఫౌండేషన్ హెల్త్ కో-ఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు. వార్డు పరిధిలోని రిసోర్స్ పర్సన్, ఆర్‌పి లకు చీరలు పంపిణీ చేశారు.

కేర్ హాస్పిటల్‌లో

కేర్ హాస్పిటల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెల్‌నెస్ ప్యాకేజిని మేయర్ ఆవిష్కరించారు. థైరాయిడ్, కాల్షియం, ఐరన్, విటమిన్ డి తదితర పరీక్షలతో కూడిన ఈ ప్యాకేజిని మహిళలందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. వివిధ పోటీలలో విజేతలైన మహిళా సిబ్బందికి మేయర్ బహుమతులను అందజేశారు. మహిళా వైద్యులను, సిబ్బందిని మేయర్ ఘనంగా సత్కరించారు. కేర్ హాస్పిటల్ ముఖ్య పరిపాలనాధికారి శ్రీనివాస్ వడ్డిపర్తి పాల్గొన్నారు.


సమైక్య అపార్టుమెంట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

ఎంవిపి కాలనీ : ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ విమెన్ డాక్టర్స్ వింగ్ ఆధ్వర్యాన వీఎమ్ఆర్‌డిఏ చిల్డ్రన్ ఎరీనాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ.లక్ష్మీనారాయణ , మాజీ అదనపు డీఎమ్ఈ డాక్టర్ పీవీ.సుధాకర్, ఐఎంఎ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ ఆర్.శశిప్రభ అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ.సత్యవతి తదితరులను సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విమెన్ డాక్టర్స్ వింగ్ చైర్ పర్సన్ డాక్టర్ జి.హేమలత, పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వి. ఆదినారాయణరావు పాల్గొన్నారు.

విశాఖపట్నం పోర్టులో...

విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యాన శాలిగ్రామపురం సాగరమాల కన్వెన్షన్‌లో జరిగిన మహిళా దినోత్సవానికి పోర్టు చైర్మన్ కె.రామమోహనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రా యూనివర్శిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ అయ్యంగారి సీతారత్నం, శైలజ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. పోర్టు మహిళా ఉద్యోగులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వైసిపి నగర కార్యాలయంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అడ్డాల కృపా జ్యోతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్పన్ సుభద్ర, గరికిన గౌరి, పద్మావతి రాష్ట్ర చైర్మన్ లో పిల్లి సుజాత నగర కార్పొరేషన్ చైర్మన్ సుజాత పల్లా చిన్న తల్లి కొండ రమాదేవి మాధవి వర్మ పాల్గొన్నారు.

11వ వార్డు పరిధి ఆరిలోవ బాలాజీ నగర్, మద్దిలపాలెం వైసిపి కార్యాలయం, 28వ వార్డు పరిధిలో లయన్స్ క్లబ్, ఓమ్ని ఆర్కే హాస్పిటల్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు.

ఏయు తెలుగు విభాగం ఆధ్వర్యాన

ఆంధ్రవిశ్వకళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యాన బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడారు.

ఐఎన్ఎస్ సర్కార్‌లో

భారత నావికాదళంలోని ఐఎన్ఎస్ సర్కార్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండింగ్ అధికారి హాజరయ్యారు.

ఆనందపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పేకేరులో మహిళల హక్కులు, చట్టాలపై దిశ పోలీస్‌స్టేషన్, వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. దిశ పోలీస్ స్టేషన్ కౌన్సిలింగ్ అధికారి మాధవి గణపతి, యుటిఎఫ్ నేత ఉప్పాడ రాము పాల్గొన్నారు. పిల్లలకు స్కూలు బుక్స్ , మహిళలకు పౌష్టికాహారాన్ని అందించారు. కర్రోతు దుర్గ రాజు, బి సత్యనారాయణ, యు.మాత పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కుర్రపల్లి ప్రాథమిక పాఠశాలలో రూపాకుల విశాలాక్షి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నెహ్రూ యువ కేంద్ర, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సహకారంతో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.



కేర్ హాస్పిటల్‌లో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

కూచిపూడి నృత్యకళాకారిణి అరుణకు 'నాట్యరత్న' పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న కూచిపూడి నృత్యకళాకారిణి అరుణ

ప్రజాశక్తి -పిఎం పాలెం: విశాఖ ద్వారకానగర్‌కు చెందిన కూచిపూడి నృత్యకళాకారిణి అనిపిండి అరుణ నాట్యరత్న పురస్కారాన్ని స్వీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 6న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన మహిళల విశిష్ట కీర్తి పురస్కారాల ప్రదానంలో భాగంగా అనిపిండి అరుణకు ఒడిస్సీ లెజెండరీ డ్యాన్సర్ షరాన్ లోవర్ నాట్యరత్న పురస్కారాన్ని అందించారు. తార అకాడమీ ఆధ్వర్యంలో నాట్యరంగానికి నృత్య కళాకారిణి అరుణకు ఈ పురస్కారాన్ని అందించారు. కాగా ఈ ఏడాది జనవరిలోనూ అండమాన్ నికోబార్ ఐల్యాండ్ దీవుల్లో నిర్వహించిన అండమాన్ కళోత్సవ్ సంక్రాంతి సంబరాల్లోనూ జాతీయస్థాయి అవార్డును అరుణ అందుకున్నారు. విశిష్ట అతిథులు భాగవతుల సేతురామ్, మంజుభార్గవి, అరుణ భిక్షు, డాక్టర్ కృష్ణమోహనరావు, తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ వంటి ప్రముఖుల సమక్షంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అరుణ వెల్లడించారు. పురస్కార గ్రహీత అరుణను పలువురు కళాప్రియులు అభినందించారు.

45 టన్నుల ఇసుక సీజ్

ప్రజాశక్తి -తగరపువలస : పద్మనాభం మండలం, పాండ్రంగి పంచాయతీ, పాత సామయ్యవలస గ్రామ పరిధిలో గోస్తనీ ఒడ్డున ఎడ్ల బళ్ల ద్వారా తీసుకొచ్చి, ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణాకు నిల్వ చేసిన 45టన్నుల ఇసుకను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది నిఘా వేసి బుధవారం సీజ్ చేశారు.ఇసుక అక్రమంగా తవ్విన వారిపై చర్యల్లో తొలిదశ చర్యల్లో భాగంగా తహశీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, ప్రస్తుత నిందితులు మరోమారు ఇదే అక్రమానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణాలకు ఇసుక కావాలంటే ముందుగా సంబంధిత శాఖల ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుందని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో సిఐ వి.రామకృష్ణ, వీఆర్ఓ కె.అప్పారావు, గనులు, భూగర్భ విభాగం టెక్నికల్ అసిస్టెంట్ షేక్ సుభాని, సిబ్బంది ఎన్ మధు, డి రమేష్, వీఆర్ఎలురాజు, తాతయ్య పాల్గొన్నారు

క్షతగాత్రునికి ఐటిబిటి పోలీసుల వైద్యం



వైద్య సేవలు అందిస్తున్న ఐటిబిటి బెటాలియన్ జవాన్లు

ప్రజాశక్తి- ఆనందపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి పందలపాక 56వ ఇండో టిబెటియన్ బెటాలియన్ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందజేశారు. మండలంలోని పందలపాక వద్ద బుధవారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో భీమన్నదొరపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసనాయుడు కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పందరపాక 56వ బెటాలియన్ వైద్యబృందం ఎఎస్ఐ లీల, ఎస్ఎంఒ క్రాంతికుమార్ తోట ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స చేశారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు.సకాలంలో వైద్య సేవలు అందించిన బెటాలియన్ వైద్యబృందాన్ని పలువురు కొనియాడారు

కార్మికుల శ్రేయస్సే ముఖ్యం

హిందుస్థాన్ షిప్‌యార్డు చైర్మన్, ఎండీ హేమంత్ ఖత్రి



ఇళ్ల పత్రాలను ఇస్తున్న షిప్‌యార్డు ఎండీ హేమంత్ ఖత్రి

ప్రజాశక్తి -ములగాడ: హిందూస్తాన్ షిప్‌యార్డ్ కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి అన్నారు. బుధవారం కార్మికుల కాలనీలోని ఇళ్లను ఆధునీకీకరించి ఉద్యోగుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, మహిళా దినోత్సవం రోజున కార్మికుల కుటుంబాలకు ఆధునీకరించిన ఇళ్లను అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో షిప్‌యార్డుకు మరిన్ని ఆర్డర్స్ రానున్నాయన్నారు. గుర్తింపు యూనియన్ సూచనలు, అభ్యర్థన మేరకు కాలనీ అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరంలో రాజాబాబు, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి -మధురవాడ: రక్తదానం మరొక ప్రాణదానమని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పిలకవానిపాలెంలో పిళ్లా భరత్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడవవార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి నేత పిళ్లా వెంకట్రావు ఆధ్వర్యంలో భరత్ కుమార్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, ఏటా తన కుమారుడు పేరిట మంగమ్మ, వెంకటరావు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భరత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇంచార్జ్ కోరాడ రాజబాబు, స్థానిక నేతలు మొల్లి లక్ష్మణరావు, నాగోతి సూర్యప్రకాష్, పోతిన సోముపాత్రుడు, పోతిన బాలాజీ, గొల్లంగి ఆనందబాబు, పోతిన నాయుడు పాల్గొన్నారు.

20 నుంచి వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- కంచరపాలెం: ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన ద్వారా ఉద్యోగ కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో కంచరపాలెం ప్రభుత్వ ఐటిఐ.(పాతది)లో ఈ నెల 20 నుంచి పిఎంకెవివై-4.0లో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నారు. మూడు నెలల కాలవ్యవధి ఉన్న డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, పిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఫీల్డ్‌టెక్నీషియన్ (ఎసి, రిఫ్రిజిరేషన్, ఎయిర్‌కండిషనింగ్), కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగం కల్పిస్తారు. ఈ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ పాసై 18-45 ఏళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9908799126 ,9346258000 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఫార్మశీ విద్యకు మెరుగైన ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో కీలకమైన ఫార్మసీ విద్యలో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ శ్రీనుబాబు గేదెల అన్నారు. బుధవారం సత్యం జంక్షన్ పల్సస్ కంపెనీలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ (ఎటిపిఐ) ఆధ్వర్యంలో 'ఫార్మసీ విద్యలో మహిళల పాత్రపై' అనే అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుశిక్షితులైన ఫార్మసిస్ట్‌లు, ఫార్మసీ అధ్యాపకులకు ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగిందన్నారు. మహిళా ఉద్యోగులకు, ముఖ్యంగా ఫార్మసీ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు పల్సస్ కంపెనీ ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. పల్సస్ ఉద్యోగులలో 75శాతం మంది మహిళలేనన్నారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టివి నారాయణ మాట్లాడుతూ, ఫార్మసీ విద్యారంగానికి మహిళలు చేస్తున్న సేవలను అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా గుర్తించిందన్నారు. రోగి సంరక్షణ, మెరుగైన వైద్యం అందించడంలో ఫార్మసిస్ట్‌లు సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు

ప్రజాశక్తి -కంచరపాలెం : సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాలులో ఈనెల 11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు సాహితీ పురస్కార గ్రహీత స్వర్ణశైలజ తెలిపారు. బుధవారం మాధవధార ఫంక్షన్ హాలులో మీడియాతో మాట్లాడుతూ, ద్రవిడ వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ సాహితీ కార్యక్రమంలో సిరికోనీయుల స్వీయ రచనల ప్రదర్శన, పుస్తకావిష్కరణలు, ప్రతిభా పురస్కారాలు, సాహితీ పురస్కారాలుంటాయన్నారు. సాయంత్రం కవి సమ్మేళనంలో తనతో పాటు విశాఖకు చెందిన పద్మావతి రాంభక్త, దర్భముళ్ల చంద్రశేఖర్‌లకు సన్మానాలు, పురస్కార ప్రదానం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర వేద విద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టి కిషన్‌రావు పాల్గొంటారన్నారు.

ఇటుక బట్టీల్లో హోలీ పండగ

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, మద్ది, పద్మనాభం, కృష్ణాపురం, విలాస్‌ఖాన్‌పాలేం గ్రామాల్లోని ఇటుక బట్టీల్లో హోలీ పండగను ఘనంగా నిర్వహించారు. బట్టీలో పనిచేస్తున్న ఒడిశా, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు ముందుగా బట్టీల యజమానులకు ముందుగా రంగులు పూశారు. తర్వాత కూలీలంతా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

కిడ్నీల ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే...

ప్రజాశక్తి -గాజువాక : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి మూత్రపిండాలను పదిలంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ రమ్య వేదుల తెలిపారు. ఏటా మార్చినెల రెండో గురువారం నిర్వహించే ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా కిడ్నీల ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన అవసరమన్నారు. ఈ ఏడాది 'అందరికీ కిడ్నీ ఆరోగ్యం, ఊహించని వాటి కోసం సిద్ధమౌతోంది, బలహీనులకు మద్దతు ఇస్తుంది' అనే థీమ్‌తో ముందుకెళ్తున్నారన్నారు. దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధులు (క్రానికల్ కిడ్నీ డిసీజెస్-సికెడి), కిడ్నీ మార్పిడి వల్ల కలిగే ఇబ్బందులపై



అవగాహన పెంచుకోవాలని సూచించారు. సికెడి రోగులు తొలిదశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు అప్రమత్తమై తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి తీవ్రతను నిరోధించవచ్చన్నారు. వాటిలో ముఖ్యమైనది రక్తంలో చక్కెర నియంత్రణ, హెచ్‌బి ఏ1సీ ఏడు కంటే తక్కువగా ఉండాలి. ఇక రెండోది రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం. పెయిన్ కిల్లర్స్ వీలైనంత తక్కువగా వాడాలి. ధూమపానం మానేయడం, వ్యాయామం చేయడం, ఎక్కువ కొవ్వు ఉన్న పదార్థాలను తినడం మానేయాలి.

ఆరోగ్యకరమైన మూత్రపిండాలకు ఎనిమిది నియమాలు

- ★ ఆరోగ్యంగా,చురుకుగా ఉండండి
- ★ రక్తంలో చక్కెర శాతాన్ని రెగ్యులర్‌గా చెక్ చేసుకోవడం
- ★ బిపిని అదుపులో ఉంచుకోవడం
- ★ సమతుల ఆహారాన్ని తీసుకోవడం
- ★ ఆరోగ్యకరమైన పానీయాలను మాత్రమే తీసుకోవడం
- ★ ధూమపానం మానేయడం
- ★ పెయిన్ కిల్లర్ మాత్రలు వాడకం మానేయడం
- ★ మూత్రపిండాల పనితీరును తనిఖీ చేయడం

ఈ ఆహారాలకు దూరంగా ఉండండి

- రెడ్ మీట్ (మటన్, బీఫ్) రొయ్యలు
- ఫాస్ట్ ఫుడ్
- శీతల పానీయాలు
- చికెన్, చేపలు, గుడ్డు పచ్చసొన, బీన్స్, బటర్, చీజ్, పెరుగు, చక్కెర, ఉప్పు

కిడ్నీల ఆరోగ్యానికి ఇలా చేయండి

- ◆ సమతుల్య ఆహారం తీసుకోండి
- ◆ రోజూ 2-3 లీటర్ల నీరు తాగండి
- ◆ నిత్యం వ్యాయామం చేయండి.

(మార్చి నెల రెండో గురువారం ప్రపంచ మూత్రపిండాల సంరక్షణ దినోత్సవం సందర్భంగా....)



డాక్టర్ రమ్య వేదుల, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ కిమ్స్ ఐకాన్, వైజాగ్.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఎంపీ సత్యవతికి కేక్ తినిపిస్తున్న మంత్రి అమర్‌నాథ్



బుచ్చయ్యపేట ఎంపిపికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



ఎంపీని సన్మానిస్తున్న ధ్యాన కేంద్రం మహిళలు



కోటవురట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అనకాపల్లి జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కేక్ కట్ చేసి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతికి తినిపించారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ బివి సత్యవతి, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి మహిళ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో గవరపాలెం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ మహిళా నాయకురాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి, తెలుగు మహిళ నాయకులు కొణతాల రత్న కుమారి, సేనాపతి స్వరూప, శంకర్ల పద్మలత, కాయల ప్రసన్న కుమారి, ఉడత పద్మ, అమరావతి, సూర్యప్రభ, సీరంశెట్టి వెంకటలక్ష్మి, దేవి, టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.

కశింకోట : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా కుర్చీ ఆటలు, పాటలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎంఎస్ అధ్యక్షులు కె అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, కోశాధికారి లక్ష్మి, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, అనురాధ, నిర్మల, సత్యనారాయణ, రామకృష్ణ, వాణి సర్పంచ్ మళ్ళ మణి, గొర్లి ఉమ, మళ్ళ పార్వతి పాల్గొన్నారు.



ఉగ్గినపాలెం స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఎంపిపి

మండలంలోని ఉగ్గిన పాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కశింకోట మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్నింటిలోనూ ముందుండాలన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని సూచించారు. అనంతరం పాఠశాల చైర్మన్ బుదిరెడ్డి కుమారికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, విఓబి కలగా పద్మ, విఆర్‌పి ఎద్దు చిన్నారి, అమరిపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా విశ్వశాంతి పొదుపు సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి వైస్ ఛాన్సలర్ ఎం ముత్యాల నాయుడు మహిళా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. శ్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్క్ డైరెక్టర్ డిఎస్ ప్రసాద్, శ్రీ విముక్తి సంఘటన నాయకులు ఓవిఎస్ లక్ష్మి, రెడ్డిపల్లి అప్పలరాజు, రిటైర్డ్ లెక్చరర్ ఎన్ దేవుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని సీతయ్యపేటలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవికి ఆర్.శివ రాం పురం మాజీ సర్పంచ్ బోయిన నారాయణ మూర్తి, వైసీపీ నాయుకులు కుంచం ప్రకాష్‌రావు, యలమర్తి వాసు, కొడమంచిలి ముసిలి నాయుడు, ఎన్నెం శెట్టి నాయుడు, నందవరపు రాజు బాబు, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. బుచ్చయ్యపేట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం బాలరాజు సమాజంలో స్త్రీ యొక్క పాత్రను వివరించారు.

సబ్బవరం : మండలంలోని జాగృతి స్వచ్ఛంద సంస్థ ఎమ్‌డి కందర్ప సుజాత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాగృతి సంస్థ ద్వారా రుణాలు పొంది పలు రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళా న్యాయవాది రజని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రస్తుత రోజుల్లో మహిళలపై సైబర్ వేధింపులు అధికంగా ఉన్నాయని, మహిళలు దిశా యాప్, నిర్భయ చట్టం, దిశా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాగృతి సీఈఓ కెఎల్ఎన్ మౌక్తిక ఆధ్వర్యంలో నిర్వహించిన పలు నృత్యాలు, షార్ట్ ఫిల్మ్, పలు విప్లవ గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ అధ్యక్షులు కోటిని అమ్మతల్లి నాయుడు, ఉద్యానవనశాఖాధికారి జి.రాధిక, నాబార్డు డీడీఎం శ్రీనివాసరావు, గొట్టివాడ సర్పంచ్ సాలాపు మీనా, ఆశా జ్యోతి, సంస్థ సిబ్బంది రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో జ్యోతి ప్రజ్వలన చేసి పారంభిస్తున్న జాగృతి ప్రతినిధులు

మునగపాక రూరల్ : నేటి మహిళలు అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతూ అత్యున్నత ప్రతిభ కనబరచడం అభినందనీయమని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నాగులపల్లి గ్రామంలో చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ తల్లిగా, సోదరిగా, భార్యగా కుటుంబంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అనంతరం ధ్యాన కేంద్రంలో సాధన చేస్తున్న పలువురు మహిళలు ఆమెను శాలువలతో సన్మానించారు. ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

కొత్తకోట : మహిళా దినోత్సవం వేడుకలు రావికమతం మండలం కొత్తకోటలో బుధవారం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు, కొత్తకోట మాజీ సర్పంచ్ కోట నీలవేణి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా మహిళా అధ్యక్షులు దిమిలి జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కోరుకొండ సంతోషి, రాజేష్, బాబ్జి, శ్రీను పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : పట్టణంలో మహిళా దినోత్సవం, హెూలీ పండుగ ఘనంగా నిర్వహించారు ఎన్టీఆర్ స్టేడియంలో నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో హెూలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా విద్యార్థులతో పట్టణ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కోచ్ శేఖర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వెలుగు కార్యాలయంలో ఏపీ రమణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో డ్వాక్రా మహిళలు పాల్గొని సంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల గేమ్‌లు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పాయకరావుపేట : పట్టణంలోని శ్రీ చైతన్య, కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఏజీఎం సురేషు, ఆర్ఐ గోపీనాథ్, విజయ్, ఏవో విజయ్, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ గౌరీ, ప్రైమరీ ఇంచార్జ్ రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నక్కపల్లి : నక్కపల్లి వైసీపీ కార్యాలయం వద్ద బుధవారం కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, మాజీ సర్పంచ్ కల్పనలను సత్కరించారు. వైసిపి నాయకులు ఈశ్వరరావు , కొప్పిశెట్టి హరిబాబు, తళ్ళ భార్గవ్, గంటా తిరుపతిరావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యస్.రాయవరం : అడ్డురోడ్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళలకు సన్మానం చేశారు. పార్టీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రమా కుమారి, జిల్లా కార్యదర్శి లాలం కాశీ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్దం, అనకాపల్లి జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజుల, నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ పాల్గొన్నారు.

మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మెడికల్ ఆఫీసర్లు శక్తి ప్రియ, వాసంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు, సత్యనారాయణ, హెల్త్ విజిటర్ రమణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



కొత్తకోట మాజీ సర్పంచ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మహిళల్లో సామాజిక, రాజకీయ చైతన్యం అవసరం

అనకాపల్లి : మహిళల్లో సామాజిక, రాజకీయ చైతన్యం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమని ప్రముఖ వైద్యులు జి.యామిని కుమారి అన్నారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన కోసం, స్త్రీ పోరాటాలకు భారత దేశం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ 1908లో స్త్రీ ఉద్యమ నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. స్త్రీ పురుష వ్యత్యాసానికి వ్యతిరేకంగా కనీస వేతనాలు, కనీస హక్కుల కోసం నేటి మహిళలు అనేక ఉద్యమాల్లో ముందుంటున్నారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ స్త్రీలలో చైతన్యం తమ ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్గారాణి, మజ్జి నాగశేషు, వివోఏల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్.రూపదేవి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్యకళ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీ చేశారు.



సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

వికలాంగుల తల్లులకు సత్కారం

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వికలాంగుల తల్లులను విభిన్న ప్రతిభవంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథులుగా మహిళ న్యాయమూర్తులు నిరూప భంజ్ దేవ్, పి ప్రదీప చేతుల మీదుగా సత్కరించి దాతల సహకారంతో అందించిన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అవయవాలు బాగున్న పిల్లలను పెంచేందుకే తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వికలాంగ పిల్లలను పోషించడం గర్వించదగ్గ విషయమన్నారు. నల్లలరాజు, పళ్ళ బాబ్జి, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, రాజాన దొరబాబు తదితరులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. ఇందులో మహిళా న్యాయవాదులు కేత కుసుమ, పద్మ, న్యాయవాది కనిశెట్టి సురేష్ బాబు, సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల తల్లులను సత్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

వైసిపిలో 150 మంది చేరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి

చీడికాడ మండలం, తురువోలు గ్రామానికి చెందిన 150 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు లాలం జానకిరామ్ ఆధ్వర్యంలో బుధవారం దేవరాపల్లి మండలం, తారువ గ్రామంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో చేరారు. వారి ఉపముఖ్యమంత్రి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అండగా ఉంటామని చెప్పారు. వైసిపిలో చేరిన వారిలో పరివాడ కోటి, సూర్ల నాగేష్, ముర్రు కొండబాబు, సోలా లక్ష్మణ, సుర్ల రామునాయుడు, చొక్కాకుల నాగలక్ష్మి, కాశిరెడ్డి స్వామి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి చీడికామ మండల నాయకులు రాజబాబు, స్వామి నాయుడు, చైతన్య, మాజీ ఎంపిపి అచ్చిబాబు, మాజీ సర్పంచ్ చొక్కాకుల కోటి, ముర్రుకోటి, జగ్గునాయుడు, కూరాకుల అరుణ్ కుమార్, సుర్లా అప్పలనాయుడు, సింహాచలం నాయుడు, ముర్రు కోటి, పి.నారాయణమూర్తి, బి.అప్పలనాయుడు, చొక్కాకుల వెంకునాయుడు, దేముడు, బుసర నాని పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగంతో కూడిన శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని శరభన్నపాలెంలో ఫౌండేషన్ కార్యాలయంలో ఇప్పటికే వచ్చిన దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా పలు కంపెనీలతో మాట్లాడినట్లు చెప్పారు. ఇందులో భాగంగా పదో తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ వెల్డింగ్, ఫైర్ సేఫ్టీ ప్లస్, స్కిల్ డెవలప్‌మెంట్, ట్విట్టర్ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించి, శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఈ

రైఫిల్ షూటింగ్‌తో రజత పతకం సాధించిన సుందరరామిరెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - పరవాడ


జాతీయ స్థాయి రైఫల్ షూటింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన మండలంలోని పిఎస్.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి ఎన్.సుందరరామిరెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. బుధవారం పాఠశాల ప్రాంగణంలో యాజమాన్యం అభినందన సభ నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి.సూర్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ఏమి చేస్తున్నామో మొదట స్పష్టత ఉండాలని, ఆ పనిని ఇష్టపడాలని, ఆ పనిని విశ్వసించాలని, ఈ మూడూ కలిపినప్పుడే విజయం సిద్ధిస్తుందని చెప్పారు. సుందరరామిరెడ్డి జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి, ఒలింపిక్‌లో పాల్గొనేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సుందరరామిరెడ్డిని, కోచ్ ఎస్.రామ్మోహన్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి విద్యార్థి తల్లిదండ్రులు నడిమిల్లి గనిరెడ్డి, శ్రీలక్ష్మి, కోచ్‌లు మనీష, గోవింద్, లోహిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుందరరామిరెడ్డిని అభినందించిన పాఠశాల యాజమాన్యం

పెట్టుబడులు తేని గ్లోబల్ సదస్సు

-జిఐఎస్ పేరిట రూ.250 కోట్లు ఖర్చు
-టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విదేశీ పెట్టుబడులు తేలేకపోయిందని, గ్లోబల్ సమ్మిట్‌కు అర్థమే లేకుండా పోయిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 3, 4 తేదీల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సదస్సును గ్లోబల్ సమ్మిట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. దీనికోసం ప్రభుత్వం రూ.250 కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. పరిశ్రమలశాఖ మంత్రి అమర్నాథ్ రోజుకో మాట, వారానికో కథ చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పాత ఎంఒయూలు, తన సొంత ఆస్థాన సంస్థలు, దావోసులో చేసుకున్న ఒప్పందాలను ఈ గ్లోబల్ సమ్మిట్‌లో మరోసారి ప్రకటించి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ సదస్సులో అక్షంతలే తప్ప చదివింపులు లేనట్టు అర్థం అవుతుందన్నారు. ఈ ఒప్పందంలో ప్రకటించిన పెట్టుబడులు ఎప్పుడు కార్యరూపం దాలుస్తాయో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తన సొంత జిల్లాలో శంకుస్థాపనలు చేసిన పథకాలైన ఎప్పటికీ పూర్తవుతాయో వెల్లడించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, పట్టణ కార్యదర్శి కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



ప్రక్షాళన నాటికలో ఒక సన్నివేశం

ప్రజాశక్తి-అచ్చుతాపురం

మండలంలోని హరిపాలెం గ్రామంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. గ్రామంలో పారిపల్లి అమ్మవారి పండగ సందర్భంగా మూడు రోజులపాటు ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి చిలకలూరిపేట వారిచే ఆలీతో సరదాగా హాస్య నాటిక, గుంటూరు వారికే ప్రక్షాళన నాటికను ప్రదర్శన చేశారు. ఈ రెండు నాటికలు వ్యవసాయం, మహిళలు పాత్ర, సమాజంలో సాంకేతిక విప్లవం, విద్య తదితర వాటిపై ఆసక్తికరంగా, ప్రజలలో ఆలోచింపజేసే విధంగా ప్రదర్శన చేశారు. పారిపల్లి అమ్మవారి పండుగ సందర్భంగా నిర్వాహకలు కాండ్రేగుల భోగలింగం, కెవిఎస్ అప్పారావు, కె.శ్రీహరి, గ్రామ పెద్దలు సహాయ సహకారాలతో ఈ పోటీలు జరిగాయి.

ఘనంగా కైట్స్ కళాశాలలో వీడ్కోలు సభ

ప్రజాశక్తి-అచ్యుతాపురం



డ్యాన్స్ చేస్తున్న కళాశాల విద్యార్థులు

మండల కేంద్రంలోని కైట్స్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం కళాశాలలో జరిగిన వీడ్కోలు సభలో సీనియర్, జూనియర్ విద్యార్థులు సరదా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల కరెస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ చదువు చెప్పిన గురువులను, తోటి విద్యార్థులను ఎన్నటికీ మరువరాదని సూచించారు. ఉన్నత చదువులు చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆడారి అప్పలనాయుడు మాట్లాడుతూ విదార్థులు ఎప్పటికప్పుడు కొత్తవిషయాలను తెలుసుకోవాలన్నారు. కైట్స్ విద్యావిహార్ స్కూల్ కరెస్పాండెంట్ రెడ్డి గణేష్ మాట్లాడుతూ చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడారి సన్యాసిరావు, డైరెక్టర్స్ అడిగర్ల శంకరరావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మే 14 నుండి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు : పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మే 14, 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్పర్సన్ కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. అమ్మవారి ఆలయంలో పుర ప్రముఖులు గ్రామ పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, భక్తులతో బుధవారం సాయంత్రం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఏడాది పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మే 12న అమ్మవారి జయంతి రోజు పండగ మొదలుకొని 14, 15, 16 తేదీల్లో జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, భక్తులు, ఉద్యోగ వ్యాపార వర్గాలు తమ సహాయ సహకారాలను అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నరసింగరావు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటగుల్లి సింహాచలం నాయుడు, మాజీ మంత్రి మణి కుమారి, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వైస్ సర్పంచ్ బూరెడ్డి రాము, వైస్ ఎంపీపీ గంగ పూజారి శివ తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన సోమేష్‌ను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

క్షతగాత్రులకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ

ప్రజాశక్తి- అనకాపల్లి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులను రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పరామర్శించారు. కసింకోట మండలం అచ్చర్ల గ్రామ సర్పంచ్ నిమ్మదల సోమేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో అనకాపల్లి మండలం మాకవరం గ్రామానికి చెందిన ఆరుగురు బాలలు గాయపడి స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని పరామర్శించిన మంత్రి అమర్నాథ్ మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు ఉన్నారు.



పట్టుబడిన నిందితులు, నాటు కోళ్లతో పోలీసులు

నాటు కోళ్లను అపహరించిన వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని తిమిరం గ్రామంలో మంగళవారం రాత్రి అపహరణకు గురైన నాటు కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని తిమిరాం గ్రామానికి చెందిన గుంపాన శ్రీను, కురందాసు అప్పలనాయుడు, యలమంచిలి దేముడు తదితర రైతుల పశువుల పాకలో ఉన్న 19 నాటు కోళ్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆపహరించుకుపోయారు. దీనిపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన ఎస్ఐ డి.నాగేంద్ర రెండు గంటల వ్యవధిలోనే దొంగలను పట్టుకున్నారు. వారి నుండి 19 నాటు కోళ్లను స్వాధీనం చేసుకొని రైతులకు అందజేశారు. నిందితులను అరెస్టు చేశారు. దొంగతనాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్కరాజు సన్యాసిరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ప్రభుత్వం ఆ కుటుంబానికి లక్ష రూపాయలు వైఎస్ఆర్ బీమా మంజూరు చేసింది. ముందుగా దహన సంస్కారాలు ఖర్చులు నిమిత్తం రూ.10వేలు బుధవారం మృతుని భార్యకు ఆ గ్రామ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. మిగిలిన మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించకుండా...

హెటిరో విస్తరణ ఒప్పందం సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు 461వ రోజుల నుంచి ఆందోళన చేపడుతున్నా ఆ సమస్యలను పరిష్కరించకుండా విశాఖలో ఇటీవల జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం హెటిరో కంపెనీ విస్తరణకు సంబంధించి ఒప్పందాన్ని కుదుర్చు కోవడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు విమర్శించారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 461వ రోజుకు చేరింది. బుధవారం ధర్నాలో అప్పలరాజు పాల్గొని మాట్లాడారు. 2006లో రూ.5,200 కోట్ల పెట్టుబడులతో 500 ఎకరాల్లో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కంపెనీ యాజమాన్యం చట్టాలను ఉల్లంఘించి, కంపెనీ చుట్టూ ఉన్న భూములను ఆక్రమించి, పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా కంపెనీ నడుపుతున్నారన్నారు. కంపెనీ నుండి వెలువడే రసాయన కాలుష్యంతో ఆ ప్రాంతంలో గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు అనేక రోగాలను బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే అనేకమంది మృత్యువాత పడటం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసలు పోవడం జరుగుతుందన్నారు. కంపెనీతో మత్స్యకారులకు ఇంత నష్టం జరుగుతుంటే విస్తరణకు ఎలా ఒప్పందం చేసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 15 సంవత్సరాల నుండి సిఆర్‌జెడ్ అనుమతి లేకుండా డీశాలినేషన్ ప్లాంట్ ద్వారా సముద్రపు నీటిని వినియోగిస్తున్నా, అనుమతులు లేకుండా పైప్ లైన్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మత్స్యకార నాయకులు వాసుపల్లి నూకరాజు, గోసల సోమేశ్వరరావు, చేపలు సోమేష్, కోడా కాశీ, పిక్కి రమణ, పిక్కి రాజు, మైలపల్లి జాన్, మైలపల్లి నరేష్, మామిడి రమణ, బొంది బాబ్జీ, మైలపల్లి దాదాజు, కొత్వాల్ కాశీ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు


పోటీలను ప్రారంభిస్తున్న సత్తిబాబురాజు


కైలాస్‌పట్నంలో
ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని కైలాస్‌పట్నంలో గ్రామ దేవత నూకాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సత్తిబాబురాజు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా యువ నాయకులు రాజగోపాల్, డివి యువసేన అధ్యక్షులు శ్రీనివాసరావు, పలువురు నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు..


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంటలో పశువైద్యాధికారి నూకేశ్వరరావు పాడి పశువులకు గాలికుంటు టీకాలు బుధవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోలుగుంట పంచాయతీ వ్యాప్తంగా సుమారు ఏడు బృందాలతో పశువులు కల్లాల వద్దనే 535 టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట వెటర్నరీ అసిస్టెంట్ పి.గుణవతి, శివ, మహేష్, సత్తిబాబు, ప్రసాద్, మల్లికరాజు, వరలక్ష్మి పాల్గొన్నారు.


తబలా, వీణ వాయిస్తున్న కళాకారులు

అలరించిన భక్తిగీతాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ఆలయ కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన వీణ, మృదంగం వాయిద్యం భక్తులను ఎంతగానో అలరించింది. విశాఖపట్నం కు చెందిన వీణ సంగీత విద్వాంసురాలు ఎన్.కృష్ణవేణి, మృదంగం విద్వాంసులు ఎన్.కార్తీక్‌లు కలిసి పలు అన్నమయ్య సంకీర్తనలు, భక్తి గీతాలను అవలీలగా వాయిద్యం చేశారు. సంగీత ప్రియులు, భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు. సాంస్కృతి కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

పలు చోట్ల వైద్యశిబిరాలు


నర్సీపట్నంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-నర్సీపటొన్‌స్థానిక షిరిడి సాయి మందిరంలో షిరిడిసాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు మద్దు వెంకటరమణ ప్రారంభించారు. 150 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 40 మంది రోగులకు ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ, కంటి వైద్యంపై ఎవరూ అశ్రద్ధ చేయ కూడదన్నారు. షిరిడి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ మాట్లాడుతూ, కంటి వెలుగు పథకం ద్వారా షిరిడి సాయి సేవా సమాజ్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవా సమాజ్ కార్యదర్శి వి.రామచంద్రరాజు, కోశాధికారి లంక ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు పోతుల సత్తిబాబు, సంయుక్త కార్యదర్శి నంబూరి సత్తిబాబు, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్రావు, కర్రి దుర్గాప్రసాద్, మీసాల సత్యనారాయణ, శంకర్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ అరుణ్ కుమార్, వైద్యులు వరహాలు, విజయ తదితరులు పాల్గొన్నారు.

బికెపల్లిలో వైద్య శిబిరం

కోటవురట్ల: కాకినాడ జిల్లా ట్రినిటీ హాస్పిటల్‌కు చెందిన వైద్య సిబ్బంది మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం బికె పల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ కు సంబంధించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. రోగులకు మందులు అందజేశారు. ట్రినిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


బికెపల్లిలో...

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఏవీ?

మాజీ మంత్రి , టిడిపి నేత అయ్యన్న

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :వైసిపి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవని మాజీ మంత్రి, టిడిపి నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు విలేకర్లకు పంపిన వీడియోలో విమర్శించారు. ఉద్యోగస్తులు పూర్తిగా నష్టపోయారన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని బూటకపు మాటలు సిఎం జగన్ చెప్పారని, ఆ మాటలతో యువతను మోసం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీలు భారీ ఎత్తున ఏర్పాటు చేసి విదేశాల్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ యువత స్థిరపడ్డారన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి కుట్రతో ప్రజలను మోసం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తానని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని ఇలా అబద్ధపు మాటలతో జగన్మోహన్ రెడ్డి మోసం చేశారన్నారు. అమర రాజా వంటి కంపెనీలు సిఎంకు భయపడి పారిపోయారన్నారు. కంపెనీల యాజమాన్యాలకు ఎంపీలు వార్నింగ్ ఇస్తుంటే మన రాష్ట్రంలో ఏ విధంగా కంపెనీలు పెడతారని ప్రశ్నించారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా వోక్స్ వేగన్ కంపెనీ విశాఖపట్నం నుంచి పోయిందని, అదే కంపెనీ ఉంటే ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల యువత విదేశాల్లో చదువుకోవాలనే ఉద్దేశంతో 4000 మందికి పైగా సుమారు రూ.364 కోట్లు వెచ్చించి విదేశాల్లో చదువుకునేందుకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి వచ్చిన దగ్గర నుండి ఇప్పటివరకు విదేశాల్లో పేదలకు విదేశీ చదువు లేకుండా చేశారని విమర్శించారు.



15న నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేటలో ఈనెల 15న నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ బొందల నూకరత్నం, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు పూజారి గొలకొండ త్రిమూర్తులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఉత్సవాలు కొత్త ఆలయంలో జరిగేలా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆలయ పున:నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు.

గాయపడ్డ మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఒడ్డిమెట్ల జాతీయ రహదారిపై ఈనెల రెండో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళా మృతి చెందినట్లు ఎస్సై శిరీష తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డ పోలవరపు ముత్యాలమ్మ (74) బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ లారీ డ్రైవర్ తండా చిన్నయ్య పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

14న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల14న పట్టణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహించను న్నామని మాజీ ఎమ్మెల్సీ టీవీవీ సూర్యనారాయణరాజు తెలిపారు. స్థానిక దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఈనెల 14న సందర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను, గోడ పత్రికలను విడుదల చేశారు. స్థానిక దుర్గా మల్లేశ్వర దేవాలయం నుండి టిటిడి కళ్యాణమండపం వరకు శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గా మల్లేశ్వర ఆలయ చైర్మన్ చెరుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొండలు దాటి ముందస్తుగానే..
ఆసుపత్రికి సురక్షితంగా గర్భిణీ
కాన్పుకు ఏర్పాట్లు చేసిన గెమ్మిలి పిహెచ్‌సి సిబ్బంది

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం చీమలపాడు శివారు జీలుగులోవ గ్రామానికి చెందిన నిండు గర్భిణీ కొర్ర సంధ్య బుధవారం కొత్తకోట పిహెచ్సికి సురక్షితంగా చేరుకుంది. ఆమెకు స్థానిక పిహెచ్సి సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. గ్రామానికి చెందిన సంధ్యకు మరి కొన్ని రోజుల్లో పురుడు సమయం దగ్గర పడింది. ఆమె చీమలపాడు శివారు జోగంపేటకు మూడు కిలో మీటర్లు దూరంలో కొండపై జీలుగు లోవలో ఉంటుంది. ఈ గ్రామానికి రోడ్డు మార్గం ఇతర సదుపాయాలు లేవు.ఏ కష్టం వచ్చినా డోలి మోతలే.... ఆసుపత్రి లో పురుడు పోసుకునేందుకు మూడు రోజుల ముందు కొత్తకోట చేరుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించారు. గర్భిణీ సంధ్య గ్రామంలోనే పురుడు పోసుకుంటానని చెప్పడంతో వైద్య శాఖ సిబ్బంది జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత నాలుగు రోజుల కిందట రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ చినబ్బాయి తదితర వైద్య బృందం జీలుగులోవ గ్రామాన్ని సందర్శించి గర్భిణీ సంధ్యకు ఆసుపత్రిలో పురుడు పోసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జి.మాడుగుల మండలం గడుతురు పంచాయతీ ఎదురు వలసలో తన తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని తెలిపింది. దీనితో సమీపంలో గెమ్మిలి పిహెచ్సిలో కాన్పు ఏర్పాట్లు చేశారు.



విచారణ చేస్తున్న ఆర్‌డిఒ

ఎమ్మెల్సీ ఓట్ల తొలగింపుపై విచారణ

ప్రజాశక్తి-గొలుగొండ: ఎమ్మెల్సీ ఓట్ల తొలగింపుపై మండలంలోని పాకలపాడులో బుధవారం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ విచారణ చేపట్టారు. పాకలపాడు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టి ఓట్లు నమోదు చేసుకున్న వారి వద్ద నుండి వివరాలను సేకరించారు. ఏడు ఓట్లు తొలగించారని పట్టభద్రులు నమోదు చేసుకున్న ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందరావు, రెవెన్యూ కార్యదర్శి స్వామి, స్థానిక పట్టభద్రులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో జగనన్న హౌసింగ్‌లో ఇల్లు నిర్మించుకున్న పెదపూడి రాజు, లావలక్ష్మి దంపతుల ఇంటిని బుధవారం గ్రామ సర్పంచ్ పత్తి రమణ ఆధ్వర్యంలో గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మండలంలో మొట్టమొదటిగా పూర్తయిన ఇంటికి గృహ ప్రవేశం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్

రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో పెద్ద బొడ్డేపల్లి వద్ద నూతనంగా బిర్యానిస్, మోర్ రెస్టారెంట్‌ను మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, 29వ బ్రాంచ్‌గా నర్సీపట్నంలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ రెస్టారెంట్‌లో 40రకాల బిర్యానీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, ప్రముఖ వ్యాపారవేత్తలు, జాలుమురి బంగార్రాజు, వెలగ నారాయణరావు, రెస్టారెంట్ నిర్వాహకులు గంగిరెడ్ల నాయుడు, బిర్యానిస్ అండ్ మోర్ ఆర్గనైజింగ్ హెడ్ సంతోష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి
కోరెడ్ల రమాప్రభను గెలిపించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి -పలు చోట్ల ముమ్మరంగా ప్రచారం



ప్రచారం చేస్తున్న వైవి, లోకనాథం

ప్రజాశక్తి- కె.కోటపాడు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలు, ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ బలపరిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో బుధవారం రమాప్రభకు మద్దతుగా ఎమ్మెల్సీ ఓట్లను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరగాలన్నా, ఎల్ఐసి, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఉండాలన్నా, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించబడాలన్నా 250 ప్రజాసంఘాల బలపరిచిన రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రమాప్రభను గెలిపిస్తే శాసనమండలిలో ప్రజల సమస్యలపై గళం వినిపిస్తారని తెలిపారు. విద్యావంతులు డాక్టర్ రమాప్రభ లాంటి వ్యక్తి ఎమ్మెల్సీగా ఎన్నుకోబడడం ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు ఓట్లు వేసి గెలిపించాలని బుధవారం మండలంలోని భోగాపురం గ్రామంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమనాయుడు తదితరులు ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో జరిగిన ఒక పెళ్లి వేడుకలో పట్టభద్రులను కలిశారు.

సిపిఐ ప్రచారం

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పట్టభద్రులను కోరారు. బుధవారం మండలంలోని సూదివలస, మర్రివలస, పాతవలస, శృంగవరం, గొట్లాం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు రమాప్రభకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొర్లే దేవుడుబాబు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఎల్లాకు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు ఓట్లు వేసి గెలిపించాలని దళిత సంఘం నాయకులు కోరారు. నర్సీపట్నంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు ఎడారి మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శ్రీనివాస్, దళిత సంఘం నాయకులు రాజ్, కెవిపిఎస్ నాయకులు నాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోదండ్ల రమాప్రభను గెలిపించాలని దళిత సంఘాల నాయకులు మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడేందుకు పేద ప్రజల వాణి శాసన మండలిలో వినిపించేందుకు రమాప్రభకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శ్రీనివాస్, దళిత సంఘం నాయకులు లావరాజు, కెవిపిఎస్ నాయకులు నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని బిఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బి.నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.సత్తిబాబు ఆధ్వర్యంలో గొలుగొండ స్టేట్ బ్యాంకు, తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను, ఉద్యోగుల సమస్యలు శాసనమండలి వినిపించాలంటే ప్రశ్నించే గొంతుకను మాత్రమే ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు సంజీవ్, వాడపల్లి, నెల్లూరి చిరంజీవి పాల్గొన్నారు.

ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలోని ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధనకు నిబద్ధతతో కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీఇచ్చారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా షిప్‌యార్డు గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులను కలిసి మాట్లాడారు. విశాఖ అభివృద్ధిలో హిందుస్థాన్ షిప్‌యార్డుకు విశేష ప్రాధాన్యత ఉందని, సంస్థ అభివృద్ధికి పాటుపడతానన్నారు. రాజకీయాలకు అతీతంగా 250 ప్రజాసంఘాలు తనకు మద్దతునిస్తున్నాయని, వారి ఆశలు, ఆకాంక్షలు వమ్ముకాకుండా, అందరి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణమూర్తి, షిఫ్ యార్డు సిఐటియు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రాంజీ, అంబేద్కర్, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి నేతలు మళ్ల చిన్నా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జోన్ నాయకులు పి.పైడిరాజు, యూనియన్ నేతలు బిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ, ప్రసాద్, కె.రామచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ప్రచారం

భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు బుధవారం కొత్తపేట, విల్సన్‌పేట ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, ఐద్వా, కెవిపిఎస్, డివైఎఫ్ఐ నేతలు కె.నాగరాణి, భాగం లక్ష్మి, ఎస్ శ్రీనివాసవర్మ పాల్గొన్నారు

గాజువాక : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ గెలుపు కోరుతూ సాయిరాంనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పాలూరు లక్ష్మణస్వామి, నాయకులు కె.సంతోషం, సిఐటియు నేత రాంబాబు పాల్గొన్నారు..

ఎన్నికల కరపత్రాల ఆవిష్కరణ

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఐద్వా నేతలు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షీలానగర్‌లో సమావేశమైన ఐద్వా సభ్యులు ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా నేత మాధురి మాట్లాడుతూ, రమాప్రభ విజయం సాధిస్తే మహిళా సమస్యలపై పోరాడతారన్నారు. కార్యక్రమంలో ఐద్వా విశాఖ కార్యదర్శి సత్యవతి, మణి, రమణి, మాధవి, కరుణ, రాధ, మణి, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి ఆధ్వర్యాన ..
టెన్త్ విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



పకీర్‌తకియాలో పుస్తకాలు ఇస్తున్న మేనేజర్ వెంకటేష్

ప్రజాశక్తి- గాజువాక : ప్రజాశక్తి విశాఖపట్నం ఎడిషన్ ప్రారంభించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఫకీర్‌తకియా గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం యుటిఎఫ్ స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ వెంకటేష్, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సిఐటియు నేత రామస్వామి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు ఎస్‌కె.మదీనావలి, మోస చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రజాశక్తి ఎడిషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాగా చదివి, మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులు కావాలని ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ వెంకటేష్ ఆకాంక్షించారు.

నర్సీపట్నంటౌన్: ప్రజాశక్తి దినపత్రిక ఆధ్వర్యాన మండలంలోని వేములపూడిలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఏపీ మధ్యాహ్న భోజన పథకం సంఘం జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి ప్రసన్న ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. ఈ మెటీరియల్ చదివి విద్యార్థులు 10వ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐ టి యు నాయకులు డి.సత్తిబాబు, ప్రజాశక్తి డిఒ బి. రవిశేఖర్, ఆటో యూనియన్ అధ్యక్షులు కె.సత్తిబాబు, ఆశ వర్కర్ కె.లక్ష్మి, సంధ్యారాణి పాల్గొన్నారు



వేములపూడిలో పుస్తకాలు ఇస్తున్న ప్రసన్న, సిబ్బంది



రోలుగుటంలో పుస్తకాలు ఇస్తున్న నేతలు, సిబ్బంది

రోలుగుంట : మండల కేంద్రంలో జడ్పీ హైస్కూలు ఆవరణలో స్థానిక జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాశక్తి ప్రచురించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ప్రజాశక్తి సిబ్బంది కె.శంకర్, బి.రవిశేఖర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.